క్లుప్తంగా

కుంకుమార్చనలు



కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: శరన్నవరాత్రుల్లో భాగంగా కుంచాలకూర్మయ్యపేటలోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హరేరామ సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరేరామ మందిరం ఆధ్వర్యంలో హరేరామ నగర సంకీర్తన ఆదివారం జరిగింది. రోజూ ఉదయం ఈ నగర సంకీర్తన 40 రోజులు జరుగుతోందని భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కథలు చదవాలి



కథలు చదువుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి కథలు చదవాలని గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమకు తెలిసిన కథలను చదవి వినిపించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. గ్రంథాలయ అధికారి వీరభద్రుడు, పాల్గొన్నారు.

సజావుగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఏపీ టెట్- 2024 పరీక్ష సజావుగా ముగిసింది. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొదటి షిఫ్టులో 170 మందికి 154 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 171 మందికి 160 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రంలో మొదటి షిఫ్టులో 100 మందికి 90, రెండో షిఫ్టులో 99 మందికి 73 మంది హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు.

తేజలక్ష్మికి సత్కారం



తేజలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా సంఘం ఎన్నికలలో పల్లె తేజలక్ష్మి ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను మణిపాత్రుని క్రియేటివ్ అకాడమి అధ్యక్షులు ఎం.భాగ్యలక్ష్మి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నాగేశ్వరరావులు ఆదివారం సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌టీవీ ఆర్.మూర్తి, రాము, పాత్రుని రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదిత్యునికి రూ. లక్ష విరాళం



చెక్కును ఈవో భద్రాజీకి అందజేసిన దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయానికి రూ.లక్ష విరాళాన్ని చిన బొందిలీపురానికి చెందిన చింతాడ గోవిందరాజులు, గిరిధర్, శివ తదితరులు ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో వై.భద్రాజీకి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, గుత్తు చిన్నారావు ఉన్నారు.

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు న్యూస్ పేపర్ రీడింగ్ పోటీలు జరిగాయి. 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, నిక్కు హరిసత్యన్నారాయణ, ప్రసాద్, ఎల్.దీప్తి ఉన్నారు.

సాగునీటి కష్టాలు



నవభారత్ సమీపంలో అడుగంటిన కాలువ



కుశాలపురం సమీపంలో కాలువ దుస్థితి ఇలా..



బైపాస్ సమీపంలో పొట్ట దశలో వరి పంట



ఇబ్రహింబాద్ వద్ద ఎండుతున్న వరి పొలం

- సాగునీరు అందక ఎండుతున్న వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో సాగునీటి సమస్య వెంటాడుతోంది. వరి పంట పొట్ట దశలో ఉంది. ఈ దశలో నీరు అవసరం. ప్రస్తుతం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ కింద రైతులు ఈ ఖరీఫ్ మొత్తం సాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువవ్వటంతో సాగు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. నారాయణపురం కుడి కాలువ కింద ఎచ్చెర్ల మండలంలో 8 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 7,175 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సంతకవిటి, పొందూరు మండలాల తరువాత ఎచ్చెర్ల మండలానికి నీరు వస్తోంది. చుక్క నీరు సైతం కాలువలో ప్రవహించడం లేదు. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, తమ్మినాయుడుపేట, కుశాలపురం, తోటపాలెం, పొన్నాడ, కొంగరాం, కొత్తపేట, ధర్మవరం, బొంతలకోడూరు, ముద్దాడ, భగీరథపురం, ఓలేటి అగ్రహారం ఇలా ప్రతి గ్రామం పరిధిలో సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ఫరీదుపేట నుంచి కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. కుశాలపురం, నవభారత్ నుంచి నీరు చుక్క నీరులేని పరిస్థితి నెలకొంది.

ఇసుక మేటలు..

ఖరీఫ్ ప్రారంభానికి ముందు మే, జూన్ నెలల్లో ప్రభుత్వం స్పందించి ఉంటే ఈ సమస్య ఉండేది కాదు. ఆయకట్టు వద్ద నీటి నిల్వ కావల్సిన ప్రాంతంలో ఇసుక మేటలు వేశారు. ఈ మేటలు సకాలంలో తొలగించ లేదు. దీంతో నీటి నిల్వ లేక, కాలువలోకి శివారు భూములకు సరిపడే నీరు రావటం లేదు. కాలువ సైతం పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించలేదు. మరోపక్క జూన్ నుంచి ఇప్పటివరకు స్థానిక రైతులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా కేంద్రంలోని మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో ప్రత్యేకాధికారి నియమించారు. లస్కర్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. కాలువకు సరిపడే నీరు విడుదల చేసే అవకాశం లేకపోవటంతో అధికారులు చేతులెత్తేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట చేతికి వచ్చే అవకాశం కపపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

20 ఏళ్లలో ఇటువంటి పరిస్థితి రాలేదు



ఖరీఫ్‌లో నారాయణపురం కుడి కాలువ కింద గత ఇరవై ఏళ్లలో ఇటువంటి పరిస్థితి రాలేదు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగునీటి సమస్య వెంటాడుతోంది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. కాలువలో చుక్కనీరు లేదు. వర్షాలు అనుకూలించపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

– పంచిరెడ్డి రాంబాబు, బొంతలకోడూరు సర్పంచ్

నిర్లక్ష్యమే సమస్యగా మారింది



ఖరీఫ్ ప్రారంభంలో ఆయకట్టు నీటి నిల్వ ప్రాంతంలో ఆసుక మేటలు తొలగించి, శివారు వరకు కాలువలో మరమ్మతులు చేస్తే నీటి సమస్య ఉండేది కాదు. ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. జిల్లా కలెక్టర్ దృష్టికి గ్రీవెన్స్ సెల్‌లో తీసుకువెళ్లటంతో ప్రత్యేక అధికారిని నియమించారు. ప్రాజక్టులో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవటం ప్రధాన సమస్యగా మారింది. ఇంతటి సాగునీటి సమస్యను ఎప్పుడూ ఈ ప్రాంత రైతులు చూడలేదు.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే

ఘనంగా తెరవే కవి సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న కవులు, రచయితలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతి నికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక (తెరవే) 97వ నెల సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. తెరవే గౌరవ సలహాదారు సురింగి మోహనరావు మాట్లాడుతూ.. తెరవే ఎన్నో పుస్తకాలను వెలువరించిందని, మంచి రచనలతో పుస్తకాలు ఇంకా విడుదల కావాలని కోరారు. రచయిత్రి బలివాడ తేజస్విని, సభ్యులు వాండ్రంగి కొండలరావులు కవితా రచనలు మెళకువలు, ఉత్తమ పుస్తక రూపకల్పనా విధానలు అనే అంశాలపై ప్రసంగించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు య.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 100వ నెల సాహితీ వేదిక సందర్భంగా తెరవే కవులు, రచయితలతో ఒక పుస్తకాన్ని ఆవిష్కరణ చేయాలని తీర్మానించారు. పలువురు కవులు సాహితీ ప్రక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.కోమలరావు, వాడాడ శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య, నిక్కు అప్పన్న, నిక్కు హరిసత్యన్నారాయణ, ఐ.ఎస్.సి.ప్రసాద్, ముట్నూరు ఉపేంద్రశర్మ, వి.రాజారావు, చాడ శ్రీనివాసరావు, తంగి ఎర్రమ్మ, లలితారెడ్డి, ఉమాకవి, బి.జగన్నాథరావు, పి.వి.దుర్గాప్రసాద్, కె.బాలాజీ రవికిరణ్, బి.జగన్నాథం, కుప్పిలి త్రినాథరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న క్లబ్ అధ్యక్షుడు రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2023-24 సంవత్సరానికి చేసిన సేవలకు గుర్తింపు లభించింది. ఈ మేరకు విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన లయన్స్ క్లబ్ కేబినెట్ సమూహంలో లయన్స్ క్లబ్ 316-ఏ గవర్నర్ గోపాలరావు చేతుల మీదుగా శ్రీకాకుళం క్లబ్ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, మెంటర్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ బాడాన దేవభూషన్‌రావులుఎక్స్‌లెన్స్ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ.. 2019 నుంచి శ్రీకాకుళంలో క్లబ్ సేలు కొనసాగుతున్నాయన్నారు.

సుదర్శక్రియ సాధనతో మానసిక ఆరోగ్యం

శ్రీకాకుళం కల్చరల్: సుదర్శన క్రియ సాధనతో మానసిక ఆరోగ్యం సాధ్యమని బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి, రాష్ట్ర టీచర్ కోఆర్డినేటర్ గడిపూటి ఆర్.అనూప్‌జీ అన్నారు. స్థానిక పెద్దపాడు రోడ్డులో ఆదివారం స్పెషల్ ఫాలో అప్ కార్యక్రమం జరిగింది. ఏవోఎల్ ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు, టీచర్ దేసూళ సురేంద్ర, వారణాసి సందీప్ పాల్గొన్నారు.

వరలక్ష్మికి అవార్డుల పంట



అవార్డును అందుకుంటున్న వరలక్ష్మి

శ్రీకాకుళం: కాకినాతలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగిన జేసీ-1 ఇండియా జోన్ కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం గ్రీన్ సిటీ అధ్యక్షురాలు బెండళం వరలక్ష్మి మూడు అవార్డులను సాధించారు. ఈమెతో పాటు ఔట్ స్టాండింగ్ న్యూ లేడీ జేసీ-1 విభాగంలో తమ్మినేని ఉషారాణి ఒక అవార్డును పొందారు. ఈ ఆవార్డులను ఆదివారం కాకినాడలో జరిగిన ఓ కార్యక్రమంలో జోన్ చైర్మన్ సురేష్ అందజేశారు. లోకల్ గ్రోత్ అండ్ డెలవప్‌మెంట్ ప్రోగ్రాం జోన్ లెవల్లో ప్రథమ బహుమతి, జేసీ-1 వారోత్సవాల్లో భాగంగా జోన్ లెవెన్ గుర్తింపు అవార్డు, 100 మొక్కలు నాటే కార్యక్రమంలో మరో అవార్డును వరలక్ష్మి సాధించారు. అవార్డులు సాధించినందుకు జేసీ-1 సీనియర్ పీజెడ్‌పీ ప్రవీణ్ కుమార్, జామి భీమశంకర్, నటుకుల మోహన్ అభినందించారు.

గణపతి హోమం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో ఆశ్వయుజ చవితి సందర్భంగా గణపతి హోమం ఆదివారం జరిగింది. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యగణేష్ శర్మల ఆధ్వర్యంలో మూల మంత్ర సహిత హోమం నిర్వహించగా.. భక్తులు అధికంకా పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు!

- తెలుగు తమ్ముళ్ల బరితెగింపు!



ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఇసుక లభ్యంకాక భవన నిర్మాణాలకు ఆటంకం కలిగింది. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ఎక్కడా అమలు కావడం లేదు. కానీ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాత్రం విచ్చలవిడిగా ఇసుకను ర్యాంపుల నుంచి అక్రమంగా తరలించి నిర్మానుష్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. తరువాత కావాల్సిన వారికి అధిక ధరల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీకాకుళం మండల పరిధిలోని రాగోలు పరిసర ప్రాంతంలో అక్రమంగా తీసుకొస్తున్న ఇసుకను నిల్వ చేస్తున్నారు. ప్రధానంగా జెమ్స్ ఆస్పత్రి వెనుక భాగంలో గల నీలగిరి తోటల్లో సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను కొంతమంది టీడీపీ కార్యకర్తలు నిల్వ చేశారు. ఆమదాలవలస మండలం దూసి ర్యాంప్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. గడిచిన వారం రోజులుగా రాత్రింబళ్లు ఇదే ప్రాంతం నుంచి ఇసుకను తరలించడం.. నిల్వలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. రాత్రి పది గంటల తరువాత లారీల్లో తూర్పు గోదావరి, విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు జాతీయ రహదారి గుండా తరలిస్తున్నారు.

ఇసుకను సీజ్ చేస్తాం

ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్న విషయాన్ని శ్రీకాకుళం తహసీల్దార్ గణపతి వద్ద ప్రస్తావించగా.. సోమవారం పరిశీలిస్తామన్నారు. రాగోలు పరిసర ప్రాంతంలో నిల్వ ఉన్న ఇసుకను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే రెవెన్యూ శాఖలో బదిలీల నేపథ్యంలో కొత్తగా వీఆర్వోను రాగోలు పంచాయతీకి నియమించామన్నారు.



ఇసుక నిల్వలు



లోడింగ్ చేస్తున్న దృశ్యం

పలు కుటుంబాలకు పరామర్శ



పాతర్లపల్లిలో విద్యార్థిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని మహంతిపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లె రామునాయుడు తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల పాతర్లపల్లి హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న కోరాడ శ్రీరామ్ సన్‌స్లేడ్ కూలి గాయపడ్డాడు. విద్యార్థిని, కుటుంబాన్ని మరోసారి కిరణ్‌కుమార్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మహంతిపాలెం, పాతర్లపల్లి సర్పంచ్‌లు గొర్లె అప్పలనర్సునాయుడు, గొర్లె రాధాకృష్ణ, నాయకులు గొర్లె లక్ష్మీనారాయణ, మహంతి వెంకటప్పలనాయుడు, గొర్లె సీతారాం తదితరులు ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి..

రణస్థలం మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న విద్యార్థి చెన్నా కుమార్‌ను తెలుగు ఉపాధ్యాయుడు అరుణ కుమార్ కర్రతో కొట్టడంతో కంటికి గాయమైంది. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పొందుతున్నాడు. మండలంలోని పెసరపాలెంలో ఉంటున్న ఆ కుటుంబాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థి తండ్రి చెన్న నాగరాజుతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వాకర్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



సభ్యులకు మెమెంటోలు అందజేసిన వాకర్స్ గవర్నర్ నారాయణస్వామి

శ్రీకాకుళం: నడక ద్వారా ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చునని, వాకర్స్ క్లబ్ సేవలు విస్తరించాలని వాకర్స్ ఇంటర్నేషనల్-102 జిల్లా గవర్నర్ జె.నారాయణస్వామి అన్నారు. నగరంలోని మహాత్మాగాంధీ మందిరం, సమరయోధుల స్మృతి వనంలో ఆదివారం వాకర్స్-102 గవర్నర్స్ మూడో క్యాబినేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో వాకర్స్ క్లబ్ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 27వ తేదీన పార్వతీపురంలో వాకర్స్ కాన్ఫరెన్స్ జరుగనున్నదని.. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విజయవాడలోని వరద బాధితులకు మారుతీ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు రూ.75 వేలు ఆర్థిక సహాయం అందించామన్నారు. అనంతరం క్లబ్ సభ్యులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కర్రోతు సత్యం, కె.మురళీధర్, ఎం.వాసుదేవాచారి, జి.ఇందిరాప్రసాద్, గుప్తా, వెంకటరమణమూర్తి, కె.వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు పాల్గొన్నారు.

సానివాడ గ్రామస్తులు ఐక్యంగా ఉండాలి

- సీఐ పైడిపునాయుడు



సానివాడ గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం రూరల్: సానివాడ గ్రామస్తులంతా ఐక్యంగా ఉండాలని శ్రీకాకుళం పట్టణ సీఐ పైడపునాయుడు అన్నారు. రాజకీయ, పాత కక్షలకు ఏ ఒక్కరూ పోవద్దని హితవు పలికారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులను ఆదివారం ఒకే వేదికపైకి రప్పించారు. పాతకక్షలు నేపథ్యంలో గొడవలకు దూరంగా ఉంటూ అందరూ కలిసిమెలసి ఉండాలని అవగాహన కల్పించారు. ఇప్పటికే సానివాడ సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఉందన్నారు. గడిచిన కొన్నేళ్లుగా జరుగుతున్న పాత కక్షలు, రాజకీయ తగాదాలు నేపథ్యంలో ఈ గ్రామంలోని ప్రతిచిన్న విషయంలోనూ శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరంగా ఫిర్యాదులు చేసుకోవడం జరుగుతోందన్నారు. ఇక నుంచి అటువంటి తగాదాలకు స్వస్తి పలకాలన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి తగాదాలు, ఘర్షణలకు పోకుండా ఏసమస్య వచ్చినా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కిశోర్‌వర్మ ఉన్నారు.

ఆధ్యాత్మిక ప్రసంగం



వక్త కోమలరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సమస్త విశ్వానికి ఆధారమైన జగన్మాత లీల విలాసమును వ్యాసుడు సంస్కృతంలో రచించిన దేవీ భాగవతంలో వివరించారని వక్త బారువ కోమలరావు అన్నారు. స్థానిక ఉపనిష్మందిరంలో భాగవతంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి వెంకట కవులు దేవీ భాగవతమును తెలుగులో పండ్రేండు స్కందాలలో గద్య, పద్యాలుగా రచించారని ఆన్నారు. వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డి.జి.పట్నాయక్, పి.పతంజలి శాస్త్రి, ఎం.వెంకటరమణ, ఎస్.నరసింహమూర్తి, కె.సూరిబాబు, పి.రవికుమార్, ఎస్.కృష్ణారావు, టి.తవుడు, సరస్వతి, అనూరాధ ఉన్నారు.

సేవాభావాన్ని అలర్చుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి మందిరంలో జిల్లా స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ పర్తియాత్ర విజయవంతంగా ముగిసినందుకు సాయి భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. సేవల విషయంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పర్తియాత్రపై పాట రచించిన సోంపేట వాసి కీన కేతనరావు, సాయి లీలామృతం నాటకం రచించి దర్శకత్వం వహించిన శశికాంత్‌లకు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, పూర్వపు అధ్యక్షులు గంగుల రమణబాబు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

గార: అంబటివానిపేట గ్రామంలో దుర్గా నవరాత్రు జీ సందర్భంగా ఆదివారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. రామమందిరం సమీపంలో అర్చకులు ఆరవెల్లి శ్రీనివాస శర్మ, శీర లక్ష్మణ గురుభవానీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు లలిత సహస్రనామ పూజ, కలశ పూజలు చేశారు. అలాగే అయ్యవారిపేట, తూలుగు, గార బస్టాండ్, కళింగపట్నం, శ్రీకూర్మంలో దుర్గా శరన్నవరాత్రుల పూజలు జరిగాయి.

ఘనంగా శరన్నవరాత్రి పూజలు



బలగలో సామూహిక సుహాసినీ పూజలు

శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నయి. ఆదివారం దుర్గాదేవి అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నానుబాలు వీధిలోని విజయదుర్గ అమ్మవారు అన్నపూర్ణగా, మొండేటివీధిలోని షిర్డీ సాయినాథుని మందిరంలో లలీతాదేవిగా అలంకరించారు. బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవస్వామి పీఠం దేవాలయంలో రెండు వందల మంది సుహాసినిలతో పూజలు జరిగాయి.